క్లుప్తంగా

ఆశాజనకంగా మినుము సాగు



తోట్లవల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో మినుము సాగు ఆశాజనకంగా ఉంది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం సుమారు నాలుగు వేల ఎకరాల్లో మినుము పంట సాగవుతోంది. ఈ ఏడాది రైతులు ఎక్కువగా టీ 9, పీయూ 31, నందిని వంటి రకాలను వినియోగించారు. వాతావరణం అనుకూలించటంతో మినుము పైరు ఏపుగా ఎదుగుతూ కళకళలాడుతోంది. మినుముకు వాతావరణం అనుకూలంగా ఉందని, ప్రస్తుతానికి తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉందని మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు.

నేత్ర వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వల్లభనేని కమలమ్మ పేరిట మనవడు కొల్లి రాజేష్ ఆర్థికసాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఈ పరీక్షలను చేశారు. ఈ పరీక్షల అనంతరం కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

మాజీ సర్పంచి రామారావు మృతి



గుడ్లవల్లేరు: కౌతవరం మాజీ సర్పంచి, గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈ కాలేజీ డైరెక్టర్ ఈడె వెంకట రామారావు(80) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన భౌతిక ఖాయానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, మాజీ మంత్రి జోగి రమేష్, బీసీ నాయకులు అనగాని నాగరాజు, పరసా పోతురాజు, పామర్తి రామ్మోహనరావు, ఈడె కృష్ణారావు, చిట్టిబొమ్మ నరసింహారావు తదితరులు నివాళులర్పించారు.

అక్షరాస్యతపై అవగాహన




గుడ్లవల్లేరు: ఉల్లాస్ అక్షరాస్యత అనేది ఒక సేవ అని ఎంపీడీఓ టి.విజయసారథి అన్నారు. ఈ కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అవగాహన సదస్సును చేపట్టారు. 2027 నాటికి నూరు శాతం అక్షరాస్యత అందించాలనే లక్ష్యంలో భాగంగా పొదుపు సంఘాల్లోని మహిళలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల నైట్ వాచ్‌మెన్లకు ఉల్లాస్‌పై అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. వెలుగు ఏపీఎం మహంకాళరావు, మండల పరిషత్ ఉద్యోగులు రాణి, ఇమ్రాన్, బలరామ్, టీఓటీ సీహెచ్.రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ముదినేపల్లి రూరల్: పామర్రు– కత్తిపూడి జాతీయ రహదారి స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా పోల్‌రాజ్ కాలువ వల్ల కోతకు గురైందని, వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు కోరారు. ఈ ప్రాంతంలో రోడ్డు మార్జిన్ పూర్తిగా కాలువలో కలిసిపోయి పడిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తరచూ ఈ ప్రాంతంలోనే తిరుగాడుతుంటారని, వారికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుడి కుటుంబానికి సాయం



గుడివాడ టౌన్: గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి అండగా ఉండటం మానవత్వమని కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ గుడివాడ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్(అమీర్) అన్నారు. స్థానిక వలివర్తిపాడు రోడ్‌లోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఎండీ.మౌలాలి ఈనెల 13న గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 వేలు యూనియన్ తరుపున శనివారం అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుర్దూస్, సీఐటీయూ నాయకుడు టి.లక్ష్మణరావు, బి.ఆంజనేయులు, ఎస్‌కే రహమాన్, ఎస్ఎం మొహిద్దీన్ భాషా, కె.నాగరాజు, ఆర్.నాగరాజు, ఎ.వెంకట రమణ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగించరూ!

- కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క
- పంట తడులకు అందని సాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఉన్నతాధికారులు స్పందించాలని వినతి



పాత లింగవరం చానల్‌లో మహేశ్వరపురం వద్ద దట్టంగా గుర్రపుడెక్క

పెదపారుపూడి: వ్యవసాయ రంగ ప్రాధాన్యతకు తగినట్టుగా నీటిపారుదల, డ్రైనేజీ శాఖలు పనిచేయటం లేదు. ఇందుకు అనేక ఉదాహరణలు కనిపిస్తున్నాయి. సీజన్‌కు ముందే సాగునీటి కాలువలను బాగు చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు ఆసక్తి చూపటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా రైతులు వ్యయప్రయాసలకోర్చి పంటలను రక్షించుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

విషయం ఇదీ..

మండలంలోని ఉన్న పాతలింగవరం చానల్‌లో గుర్రపు డెక్క దట్టంగా ఉండటంతో సాగునీరు కిందకు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మహేశ్వరపురం వంతెన సమీపంలో గురపుడెక్క దట్టంగా ఉండటంతో సాగునీరు చివరి భూములకు అందటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం మినుము పంటకు నీళ్ల తడి తప్పని సరిగా పెట్టాల్సి ఉంటుంది. దీంతో రైతులు చివరి భూములకు నీళ్ల సరిపడా అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని మహేశ్వరపురం, గుర్విందగుంట రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంట్రప్రగడ నుంచి దోసపాడు అనుసంధాన సౌత్ చానల్, నార్త్ చానల్ అంతా గురపడెక్క, తూడు అల్లుకుపోవటంతో సాగునీరు కిందకు రావటం లేదని పెదపారుపూడి, వానపాముల, జమిదింటకుర్రు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.



వెంట్రప్రగడలో తాళం వేసి వేసిఉన్న ఇరిగేషన్ కార్యాలయం

ఇరిగేషన్ కార్యాలయానికి తాళాలు..

వెంట్రప్రగడలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయం ఎప్పుడు చూసినా తాళాలు వేసి ఉంటోందని రైతులు అంటున్నారు. సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. రైతులకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఆ దిశగా విధులు నిర్వహించటం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట నీటి తడులు ఇచ్చేందుకు సహకరించాలని రైతులుకోరుతున్నారు. కాలువలను బాగుచేసి సాగునీరు కాల్వ చివరి భూములకు అందేలా చూడాలని కోరుతున్నారు.

నల్లయ్యకు నివాళులర్పించిన డీఎన్నార్



నల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: పాత కక్షల నేపథ్యంలో గురువారం హత్యకు గురైన కలిదిండి మండలం సంతోషపురం మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శనివారం పరామర్శించారు. నల్లయ్య భార్య అనసూయమ్మ, కుమారులు భోగేశ్వరరావు, ఆంజనేయులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ, మూలలంక సర్పంచ్ మహదేవ విజయ్ బాబు, భాస్కరరావుపేట సర్పంచ్ గద్దె ఆనంద్, కొండంగి, సంతోషపురం ఎంపీటీసీలు ఇమ్మనేని లక్ష్మణరావు, నంద్యాల ఏడుకొండలు, నాయకులు ద్రోణాద్రి ఫ్రాన్సిస్, దనికొండ రాజబాబు, దుగ్గిరాల రంగారావు, గండికోట వెంకటేశ్వరరావు, మిండ్యాల సత్యం పాల్గొన్నారు.

నిమ్మకూరులో అలరించిన స్వరాభిషేకం



నిమ్మకూరులో గాయకులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ, నేతలు

నిమ్మకూరు(పామర్రు): మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో శనివారం ఘనంగా స్వరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు రాష్ట్ర మాజీ సీఎం, నటుడు ఎన్టీ రామారావు నటించిన చిత్రాలలోని పాటలను రాగయుక్తంగా ఆలపించి పలువురిని అలరించారు. పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం మురళీ కృష్ణ మాట్లాడుతూ నిమ్మకూరులో ఎన్టీఆర్ మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. స్థానికులు నందమూరి జయకృష్ణ ప్రసాద్, కుదరవల్లి రఘురామయ్య, నందమూరి శివరామకృష్ణ కళాకారులను 15 మంది గాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరికీ స్వామివారి అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు బ్రహ్మేశ్వరరావు, బాపట్ల నాగేశ్వరరావు, నాయుడు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీ రామారావుకు ఘనంగా నివాళి



గుడివాడలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పామర్రు: నటుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు వర్ధంతిని పామర్రు, కొమరవోలు, నిమ్మకూరు, జమిగొల్వేపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఎన్టీర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, నాయకులు ఎస్వీ కృష్ణారావు, గూడపాటి గిరిబాబు, చొప్పరపు నాగసుబ్రహ్మణ్యం, వీరంకి వరహాలరావు, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలో శనివారం నిర్వహించారు. కొసరాజు బాపయ్యచౌదరి, పోలవరపు వెంకట్రావు, పొట్లూరి రవికుమార్, ఈవీవీ మోహనరావు, జంగం మోహనరావు, వల్లభనేని రంగారావు, పురిటిపాటి సుబ్బారెడ్డి, సాయి, వీరమాచినేని శివప్రసాద్, యెనిగళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నందివాడ: ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలో శనివారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి గ్రామ సర్పంచ్ సింగాల రాధాకష్ణ నివాళులర్పించారు. ఉప సర్పంచ్ సత్యానందం, పొన్నకేశ్వరరావు, కిరణ్ ప్రసాద్ బాలాజీ పాల్గొన్నారు. జనార్ధనపురంలో అంజిరెడ్డి, మిల్లు బాబి నివాళులర్పించారు.

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టీఆర్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రాము రక్తదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం కార్మికులకు వస్త్రదానం చేశారు. అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కోశాధికారి సీహెచ్. రామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి వెంట్రప్రగడ టీడీపీ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి శనివారం ఘనంగా జరిగాయి. మండలంలోని చిగురుకోట, ముదినేపల్లిలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కోడాలి వినోద్, అల్లూరు, పెదపాలపర్రులో టీడీపీ నేతలు, అభిమానులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మండవల్లి: భైరవపట్నంలో శనివారం ఎన్టీఆర్ పార్క్ వద్ద మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తున్న విద్వాంసులు

గుడివాడ టౌన్: శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్యన్నారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశసభ, ఉపద్రష్ట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి 178వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. సంగీత విద్వాంసులు పోపూరి శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఉత్సవ సంప్రదాయ దివ్యనామ సంకీర్తన గానం ఆలపించారు. ఏలూరుకు చెందిన దాగుడిపాటి లలిత స్వామి వారి రచనలను స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్జెల సతీష్ బాబు, రఘునాథ్, శ్రీదేవి ప్రవల్లిక, వైష్ణవి, శివరంజని, ప్రణతి, షణ్ముఖప్రియ, ఉషామాధురి, సుబద్ర, విజయలక్ష్మి, బాలాకుమారి, వర్ధని, హేమలత తదితర సంగీత విద్వాంసులు స్వామి వారి సంగీతాలు ఆలపించి సంగీత ప్రియులను అలరింపచేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మిడి భద్రయ్య, ఉపద్రష్ట సంస్థ అధ్యక్షుడు రామస్వామి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



మండవల్లి హైస్కూల్‌లో పరీక్ష పత్రాలను సిద్ధం చేస్తున్న అధికారులు

మొవ్వ: స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని 221 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 100 మంది గైర్హాజరయ్యారు. 121 మంది విద్యార్థులు రాసిన ఈ పరీక్షలకు సెంటర్ లెవెల్ అబ్జర్వర్ (సీఎల్‌ఓ)గా వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయం ప్రతినిధి డాక్టర్ టీవీ నాగరాజు పర్యవేక్షించారు. సీఎస్‌గా మొవ్వ హైస్కూల్ ఉపాధ్యాయులు పి.శివకోటేశ్వరరావు వ్యవహరించారు.

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షా కేంద్రంలో 145 మంది విద్యార్థులకుగాను 70 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

వెంకన్నకు మొక్కుబడుల చెల్లింపు



భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వేలాదిమంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాల్జీ, ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరులో మానవహారంగా ఏర్పడిన ఎంపీడీఓ రవికాంత్, సిబ్బంది



గుడ్లవల్లేరులో మొక్కకు నీరు పోస్తున్న ఎంపీడీవో విజయసారథి



కూచిపూడి పంచాయతీలో మొక్కలు నాటుతున్న సర్పంచ్, అధికారులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



నందివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

తోట్లవల్లూరు: స్వచ్ఛ ఆంధ్రలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తోట్లవల్లూరు ఎంపీడీఓ రవికాంత్ సూచించారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశుభ్రం చేయటంతోపాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రపై ఎంపీఈఓ రవికాంత్ అవగాహన కలిగించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివస్‌తో పరిసరాలు పరిశుభ్రత పెరుగుతోందని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర చెప్పారు. కైకలూరు సచివాలయం వద్ద సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఆధ్వర్యంలో కూటమి నేతలతో కలసి కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నేతలు, పంచాయతీ ఈవో ఆనంద భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మండవల్లిలో శనివారం నిర్వహించారు. సర్పంచ్ మెండ ఝాన్సీ, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ, మెండా సురేష్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది ఆర్అండ్‌బీ రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): నెలలో ప్రతి మూడవ శనివారం గ్రామాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు మొవ్వ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, వార్డ్ సభ్యుడు కావూరి పూర్ణచంద్రశర్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పంచాయతీ సచివాలయాల వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎంఎస్‌కే పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి కె. పుష్పనాథం, జూనియర్ అసిస్టెంట్ ఏఆర్ ఫణీంద్ర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని ఎంపీడీఓ టి.విజయసారథి అన్నారు. గుడ్లవల్లేరులో ఆయన మొక్కల నాటే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా గల బజారులో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వై. రామకృష్ణ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాకరవాడ, శ్రీహరిపురం గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. కాకరవాడలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

నందివాడ: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని ఎంపీపీ ఆదాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీపీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పర్యావరణాన్ని పరిరక్షిస్తుందన్నారు. ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షించేందుకు ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బాషా, ఏట కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: పెరికెగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పెరుమాళ్ళ పద్మ ఆధ్వర్యంలో డ్రెయిన్ శుభ్రం చేశారు. కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తుది దశకు క్రికెట్ పోటీలు

కైకలూరు: పోలీసుశాఖ వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు తుది దశకు చేరాయి. శనివారం ఫైనల్స్‌కు చేరడానికి నాలుగు జట్లు పోటీపడ్డాయి. ఉదయం మ్యాచ్‌లో డేంజర్ బాయ్స్ 15 ఓవర్లకు 9 వికెట్ల నష్టానికి 114 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన మండవల్లి జట్టు 14.4 బంతులలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. ఉత్కంఠతో సాగిన ఈ పోటీలో చివరి రెండు బాల్స్‌లో 3 పరుగులు కొట్టాలి. పైగా ఇదే చివరి వికెట్ కావడంతో ఎంతో ఆసక్తిగా తిలకించారు. మండవల్లి జట్టులో బ్యాట్స్‌మెన్ సాంబ చివరి రెండు బంతులలో మొదటి బంతిలో సిక్స్ కొట్టడంతో మండవల్లికి విజయం దక్కింది. డేంజర్ బాయ్స్ జట్టులో బౌలర్ వీరమల్లు నాగరాజు మూడు ఓవర్లకు ఒకటి మెయిడిన్ వేయడంతో పాటు కేవలం 8 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. కైకలూరు వేగ జట్టు మొదటి బ్యాటింగ్ చేసి 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన నాగరాజు లెవెన్స్ జట్టు 10.3 ఓవర్లకుగాను 10 వికెట్ల నష్టానికి 68 పరుగులు సాధించి ఓటమి చెందింది. నిర్వాహకులు మాట్లాడుతూ ఆదివారం ఫైనల్స్ జరుగుతాయి.

విజయవాడకు తరలిరండి

గుడివాడ టౌన్: విజయవాడ బందరు రోడ్డులోని స్మృతి వనంలో అప్పటి అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 220 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది అవుతున్న సందర్భంగా ఆదివారం మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు మాలల ఐక్యవేదిక జాతీయ నాయకుడు పొంగులేటి జయరాజు శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరాలు

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి.సూర్యచంద్రరావు శనివారం తెలిపారు. ప్రతిభ గార్డెన్స్ వద్ద ఉదయం 9 గంటల నుంచి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం పరీక్షలు నిర్వహిస్తారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. స్థానిక పెదవీధిలోని సంఘం స్కూల్ (మున్సిపల్) ఆవరణలో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు శనివారం తెలిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, విజయవాడ మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేస్తారు.